www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 333 | శుక్రవారం, 1 మే, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 333 | FRIDAY, MAY 1, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## శ్రామికుల పోరాట ఫలం 'మే' డే..

• నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం




2 లో..

## ఉస్మానియాలో అరుదైన వైద్యం



### 22 నెలల బాలుడికి కాలేయ మార్పిడి
### దేశంలో ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ చికిత్స చేయడం ఇదే తొలిసారి
### ఉస్మానియా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహాల



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:

జన్యుపరంగా అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న 22 నెలల బాలుడికి ఉస్మానియా వైద్యులు కొత్త జీవితాన్నిచ్చారు. ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు ఆ చిన్నారికి కాలేయ మార్పిడి చేసి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించారు. బాలుడి తండ్రి కాలేయం నుంచి కొంత భాగాన్ని తీసుకుని దాన్ని అతడికి అమర్చారు. ఈ శస్త్రచికిత్స వివరాలను ఉస్మానియా వైద్యులు గురువారం తెలిపారు. పాతబస్తీ పరిధిలోని ఉడమ్‌గడ్డకు చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్, సాజియా ఖాతూన్ కుమారుడు మహ్మద్ అఫాన్ కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. అధిక ఆకలి, పొట్ట ఉబ్బరం, తెల్లవారుజామున అలసట, నిద్రమత్తు, ఆడేటప్పుడు త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్న ఇటీవల ఆ చిన్నారిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. అతనికి పలు వైద్య పరీక్షలను నిర్వహించిన వైద్యులు.. రక్తంలో చక్కెర స్థాయిలు 50ఎంజీ/డీల్ కంటే తక్కువగా ఉండటం, ట్రైగ్లిసరైడ్లు 786, సీరమ్ కొలెస్ట్రాల్ 1200 ఉండడం గమనించారు. కాలేయ పనితీరు సవ్యంగా లేదని గుర్తించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయగా.. బాలుడి కాలేయం గణనీయంగా పెరిగినట్టు వెల్లడైంది. దీంతో బాలుడి కాలేయాన్ని కొంతమేర సేకరించి బయాప్సీ, జన్యు పరీక్షల నిర్వహించగా 'గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్ టైప్-3' ఉన్నట్లు తేలింది. ఈ సమస్య వల్ల.. ఆ బాలుడు తీసుకున్న ఆహారం గ్లూకోజ్‌గా మారి ఇతర అవయాలకు వెళ్లకుండా అక్కడే నిల్వ ఉంటోందని, దానివల్లే బాలుడు పలు సమస్యలు ఎదుర్కొంటున్నాడని గుర్తించారు. ఈ సమస్యకు వెంటనే చికిత్స చేయకపోతే మెదడు, గుండెకండరాలపై తీవ్రమైన ప్రభావం మిగతా 2లో..

## సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

• జూన్ 15నాటికి విద్యార్థులకు అవసరమైన పాఠ్య సామగ్రి అందాలి • వస్తువు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడొద్దు • ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి • సంక్షేమ శాఖలపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తు, నోటు బుక్స్, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థుల చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖ, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొ క్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునే వని.. వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు. గతంలో దుస్తు, నోట్ బుక్స్, ట్రంక్ పెట్టె, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో మిగతా 2లో..

## శ్రామిక లోకానికి 'మే' డే శుభాకాంక్షలు



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:

శ్రమజీవుల కష్టానికి గౌరవం, గుర్తింపునిచ్చే 'అంతర్జాతీయ కార్మి క దినోత్సవం' సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మిక లోకానికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశా రు. కష్టం చేసిన ప్రతి చేతి విలువను గుర్తించి, సమానత్వం, న్యా యం, గౌరవం కోసం కలిసి ముం దుకు సాగుదామని సిఎం పిలుపునిచ్చారు. "ప్రతి కార్మికుడి చెమట చుక్కలో మన సమాజ భవిష్యత్తు దాగి ఉంది. కార్మికుల అంకితభావం, కష్టపడే మనస్తత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. వ్యవస్థీకృత, అసంఘటిత కార్మికు ల హక్కులను కాపాడటంలో ప్రజాప్రభుత్వం నిరంతరం పాటు పడుతుంది" అని చెప్పారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని పేర్కొన్నా రు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ చట్టం, వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య మిగతా 2లో..

## అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

• కార్డులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్, ఏప్రిల్30 (వార్త వేదిక సూర్య):

జర్నలిస్టులెంతో కాంగా ఎదురు చూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డు ల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబా ద్ హిమాయత్‌నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వా నికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారు లకు తెలియజేస్తే వారి కార్డు తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32వేల నుండి 35వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవో ప్రకా రం సుమారు 46వేల మందికి లబ్ధి చేరుతుందని తెలిపారు. ఇప్పటి రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థా యి కార్డు మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డులు మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు.



## ఉద్యమ సమయంలో పోలీసులు, ప్రజల మధ్య గ్యాప్!

• తెలంగాణ ఉద్యమాన్ని పోలీసులు అణచివేశారనే అభిప్రాయం ఏర్పడింది • ఆ అంతరాన్ని తొలగించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల్లోకి వెళ్లాం • డీజీపీ శివధర్ రెడ్డి • ఉద్యోగ విరమణ చేసిన శివధర్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 29:

తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసులు అనుసరించిన విధానాల వల్ల ప్రజలకు, పోలీసులకు మధ్య అంతరం పెరిగిందని, 16 ఏళ్ల తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల భావాలను పోలీసులు అణచివేశారనే పేరు ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఏర్పడిన ఆ అంతరాన్ని తగ్గించడం కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 'ఫ్రెండ్లీ పోలీసింగ్' ద్వారా ప్రజలకు పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించగలిగామని వివరించారు. చిన్ననాటి నుంచే స్వరాష్ట్రం ఏర్పడాలనే కాంక్ష తనలో ఉండేదని, సిద్ధించిన తెలంగాణ రాష్ట్రానికి తనను డీజీపీగా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానని పేర్కొన్నారు. సీఎం తనకు ఎన్నో కీలక బాధ్యతలు మిగతా 2లో..



## ఫీజు రీయింబర్స్ చేయరు.. వసూలు వద్దంటారు!

• ప్రభుత్వ జీవోపై హైకోర్టు అసంతృప్తి • గతంలో న్యాయస్థానం జారీ చేసిన త్తర్వులకు విరుద్ధంగా ఉన్నట్లు వెల్లడి • కోర్టు ధిక్కరణ కిందకొస్తుందని హెచ్చరిక.. • ప్రైవేటు కాలేజీల పిటిషన్లపై విచారణ • జీవోపై తాత్కాలిక స్టే..

2 లో..




## కవిత పార్టీ పేరు తెంగాణ రక్షణ సేన

• ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం • టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో అంటూ కవిత పోస్ట్ • తెంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం కృషిని చేస్తా • రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తానని ప్రకటన

2 లో..


## పదిలో 85.25% పాస్

• ఈసారీ అమ్మాయిలే టాప్ • ఫలితాల్లో మన్యం ఫస్ట్.. అల్లూరి లాస్ట్ • టాప్‌లో రెసిడెన్షియల్ స్కూళ్లు • విశాఖ బాలిక జ్ఞానేశ్వరి 599 మార్కులతో స్టేట్ టాపర్

అమరావతి, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత పెరిగింది. గతేడాది కంటే ఈసారి 4.15 శాతం మెరుగుపడింది. గతేడాది 81.14శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 85.25శాతం పాసయ్యారు. మొత్తంగా 6,18,131 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 5,26,954 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ఈ ఏడాది కూడా బాలికలదే పైచేయి. అబ్బాయిలు 2,59,633 (82.68శాతం) మంది, అమ్మాయిలు 2,67, 321 (87.9శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 5.22శాతం ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్షల ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ గురువారం ఎక్స్ ద్వారా విడుదల చేశారు. 16 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. 2161 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా 96.07శాతంతో టాప్‌లో నిలిచింది. అల్లూరి సీతారామరాజు మిగతా 2లో..





## తెలుగు రాష్ట్రాలకు చల్లని కబురు..

2 లో..

• వచ్చే మూడు రోజులు వర్షాలు! • ఈదురు గాలులు, పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయి • ప్రజలు అప్రమత్తంగా ఉండాలి • వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక

సంపుటి: 1 సంచిక: 333 వార్త వేదిక సూర్య శుక్రవారం, 1 మే, 2026

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

(మొదటి పేజీ తరువాయి)

జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాద న్నారు. విద్యార్థులకు అందజేసే నోట్ బుక్స్, ట్రంక్ పెట్టె, ప్లేట్లు, గ్లాసు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డు, యూనిఫాం అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశిం చారు. నాణ్యతతో పాటు సకాంలో అందడంపైనా ప్ర త్యేక శ్రద్ధ వహించ్చారు. జూన్ 15 నాటికి విద్యార్థు లకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపుపూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండ స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిం చారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పా ఠశాలల, హాస్టళ్లకు వస్తువుల సరఫరా జరిగేలా చర్యల చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోల, వీ డియోల తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాల, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వా టిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజే సేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసుల, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మా యాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదుల తదితరుల పాల్గొన్నారు.



## శ్రామిక లోకానికి 'మే' డే శుభాకాంక్షలు

నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికు లకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మి కులకు రూ.5వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా, వారి కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించడం వంటి అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి గారు వివరించారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సిఎం

షార్ట్ సర్క్యూట్ కారణంగా నిర్మల్ జిల్లా పెంబి మండల కేం ద్రంలో చేతికొచ్చిన మొక్కజొన్న పంట కాలిపోయి రైతులు ఆవే దనలో ఉన్నారన్న సమాచారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెం టనే స్పందించారు. ఆ సంఘటన పూర్తి వివరాలు పరిశీలించి న ష్టపోయిన రైతులకు తగిన విధంగా ఆదుకోవాలని, ఆర్థిక సహా యం అందించాలని ముఖ్యమంత్రి గారు సీఎంఓ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు అధికారులు, జిల్లా కలెక్టర్ అవసరమైన చర్యలు చేపట్టారు.

# ఫీజు రీయింబర్స్ చేయరు.. వసూలు వద్దంటారు!

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:**

విద్యార్థుల ఖాతాల్లో రీయింబర్స్‌మెంట్ మొత్తం జమ చేసిన తర్వాతే వారి నుంచి ఫీజులు వసూలు చేయాలని, అడ్మిషన్ల సమయంలో ఫీజుల కోసం ఒత్తిడి తీసుకురావద్దంటూ ప్రైవేటు కాలేజీలకు సంబంధించి ప్రభుత్వం వెలువరించిన జీవోను హైకోర్టు తప్పుబట్టింది. ఈ అంశంపై తాము ఏప్రిల్ 2వ తేదీన జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులకు ఈ జీవో విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందని హెచ్చరించింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ పలు ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అవినాశ్ దేశాయ్, ఎల్. రవిచందర్ వాదనలు వినిపించారు. ఫీజు వసూలుకు అవకాశం కల్పిస్తూ హైకోర్టు ఏప్రిల్ 2న ఇచ్చిన ఆదేశాల మీద కౌంటర్లు దాఖలు చేయకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు గడువు గురించి చెప్పకుండా ప్రభుత్వం బుధవారం జీవో 7 జారీ చేసిందన్నారు. దీంట్లోని 12వ నిబంధన ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ప్రభుత్వం ఆయా విద్యార్థుల ఖాతాలకు బదిలీ చేస్తుందని, ఆ తర్వాత నిర్ణయించిన మొత్తం ప్రకారం విద్యార్థులు కాలేజీకి ఫీజు చెల్లిస్తారని తెలిపారు. ఈ నిబంధన వల్ల ఫీజులను వసూలు చేసుకునే అవకాశం కాలేజీలకు లేకుండా పోయిందని, ఈ నిబంధనను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది ఎస్. రాహుల్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు గడువు, కాలేజీలకు టోకెన్ల జారీ తదితర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయడానికి సోమవారం వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రభుత్వం జారీ చేసిన తాజా జీవోలోని నిబంధన.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా ఉందన్నారు. దీనిని కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి వస్తుందన్నారు. సదరు నిబంధనను మే 4వ తేదీ వరకు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను కూడా అదే తేదీకి వాయిదా వేశారు.



# ఉద్యమ సమయంలో పోలీసులు, ప్రజల మధ్య గ్యాప్!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించారని, ఆయన విజన్‌కు అనుగుణంగా తెలంగాణ పోలీసులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. డీజీపీగా శివధర్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. శుక్రవారం కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం హిమాయత్‌సాగర్‌లోని పోలీస్ అకాడమీలో శివధర్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శివధర్‌రెడ్డికి సహచర ఐపీఎస్ అధికారులు, వందలమంది పోలీసు సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యాలయం ప్రాంగణంలో పూలతో అలంకరించిన ఓపెన్‌టప జీపులో శివధర్ రెడ్డి నిల్చోగా ఐపీఎస్ అధికారులు ఆ వాహనానికి కట్టిన తాళ్లను లాగుతూ గౌరవప్రదంగా ప్రవేశద్వారం ఆవలి వరకు తీసుకెళ్లారు. సాయంత్రం 4గంటలకు డీజీపీ చార్జిని శాంతిభద్రతల విభాగం డీజీపీ మహేశ్ భగవత్‌కు అప్పగించారు. అంతకుముందు ఉదయం అకాడమీలో డీ జీపీ శివధర్‌రెడ్డికి వీడ్కోలు పరేడ్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి డీజీపీగా వస్తున్న సీవీ ఆనంద్ సవాళ్లను దీటుగా స్వీకరించే అధికారి అని, ఆయనకు అభినందనలు తెలుపుతున్నానని శివధర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్న సీవీ ఆనంద్ మాట్లాడారు. పోలీసు వృత్తిలో శివధర్ రెడ్డి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, ఆపరేషన్ కగార్ సందర్భంగా మావోయిస్టులు లొంగిపోవడంలో డీజీపీ శివధర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని, పోలీసు కుటుంబాల కోసం ఎన్నో సంస్కరణలు అమలు చేశారని పేర్కొన్నారు.



# 'పది'లో 85.25% పాస్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా 57.12 శాతంతో చివరిన ఉంది. మేనేజ్‌మెంట్ల వారీగా అయితే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 96.04శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచాయి. ఇక పాసైన మొత్తం విద్యార్థుల్లో 83.69శాతం మంది ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. విశాఖపట్నానికి చెందిన జ్ఞానేశ్వరి 599 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచింది. 47 మంది విద్యార్థులకు 598 మార్కులు రావడం విశేషం. సప్లిమెంటరీ పరీక్షలు మే 25 నుంచి జూన్ 4 వరకు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. మే 1 నుంచి 9 వరకు ఫీజులు చెల్లించవచ్చు. ఫైన్‌తో 24 వరకు కట్టొచ్చు. అలాగే 1 నుంచి 7 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలి. ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల మెమోలు త్వరలో పాఠశాలలకు పంపుతారు

# శ్రామికులకు మేడే

## శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈమాట న్యూస్):**




అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు కార్మిక కర్షక లోకానికి శుభా కాంక్ష లు తెలిపారు. ఉత్పత్తి రంగంలో భాగమై దేశ సంపదను సృ ష్టిస్తున్న కార్మికుల రెక్కల కష్టం, వారి త్యా గాలు అమూల్యమైన వని కొనియా డారు. చారిత్రాత్మక మే డే స్ఫూర్తితో బిఆర్ఎస్ ప్రభుత్వం, సబ్బండ కులాల కర్షక కార్మికుల సంక్షేమం కోసం అనే క సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, ఆదర్శవంతమైన పారిశ్రా మిక విధానాలను అమలు చేసిందన్నారు. సింగరేణి, ఆర్‌టిసి, భవన నిర్మాణ రంగం సహా పలు రంగాలకు చెందిన కార్మికులు, ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల కో సం గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ను కెసిఆర్ గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వినూ త్న పారిశ్రామిక విధానాల ద్వారా తెలంగాణలో సంపద సృష్టించ డంతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని కెసి ఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాటి పదేండ్ల ప్రగతి కార్యాచ రణను మరింత పటిష్టంగా అమలుచేయడమే రాష్ట్ర కార్మిక లోకా నికి మనమిచ్చే గొప్ప కానుక అని కెసిఆర్ స్పష్టం చేశారు.




# కవిత పార్టీ పేరు తెంగాణ రక్షణ సేన

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:**

'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాగా తెంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నె 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.



# తెలుగు రాష్ట్రాలకు చల్లని కబురు..

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 30:**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. నేడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. నిన్నటి ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.




# శ్రామికుల పోరాట ఫలం 'మే' డే..

తన చెమట చుక్కలను చిం దించి, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. 'మే' డే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. 'మే' డేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. 19వ శతాబ్దంలో పరిశ్రమల్లో పని చేసేందుకు అసంఖ్యా కంగా కార్మికుల అవసరం ఏర్పడింది. పెట్టుబడి దారులు శ్రామికులతో బానిసల్లాగా పని చేయించి అధిక లాభాలు పొందుతుండేవారు. కనీస వసతులైన తిండి, బట్ట, నివాసం వంటివి కల్పించకుండా కనీసం రోజుకు 16 నుంచి 20 గంట లు పని చేయించేవారు. పని స్థలాల్లో సరియైన గాలి, వెలు తురు ఉండేవి కావు. దాంతో కొందరు కార్మికులు ప్రమాదా లకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. ఈ పరిస్థితికి భిన్నంగా, శ్రమదోపిడీ నుంచి బయటపడేందుకు కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజే 'మే' డే. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ ఎనిమిది గంటల పని దినం అమల్లోకి రావడంతో జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. 'మే' డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గా లకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుష లమే...మా శక్తికి కూడా పరిమితులుంటాయి....ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిద ర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంట లు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారు. చికాగో పోరా టం కంటే ముందే భారత దేశంలో కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో 1862లో సమ్మె చేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అయితే ఆ పోరాటం విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారకపోవడంతో ఉద్యమ స్వరూపాన్ని అందుకో లేదు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైం ది. 1923లో మొదటిసారిగా భారత దేశంలో 'మే' డేను పా టించారు. అప్పటి నుంచి ప్రతి యేడు కార్మికులు ఐక్యంగా 'మే' డేను పాటిస్తున్నారు. 1985 తర్వాత చోటు చేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మిక వర్గాలు కార్మిక చట్టాల అమలుకు నోచు కోవడం లేదు. మార్కెట్‌లో శక్తులు ఎక్కడ శ్రమను దోచు కునే అవకాశం ఉందో అక్కడే కంపెనీలు పెట్టేవారు. అమెరి కాలో ఉన్న కంపెనీలు అక్కడ ప్రజా చైతన్యం ఉన్నది కాబ ట్టి... కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపె నీలు పెడుతూ కార్మికులతో 10 నుంచి 12 గంటల వకు పని చేయించేవారు. ఇప్పటికీ దేశంలో అక్కడక్కడ ఈ శ్రమ దోపిడీ కళ్లకు గట్టినట్లు కనిపిస్తుంటుంది. వివిధ రంగాల్లో విద్యావంతులైన యువత నేడు అధిక శ్రమదోపిడీకి గురవుతూనే ఉన్నారు.

# ఉస్మానియాలో అరుదైన వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

పడే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్ టైప్-3 సమస్యకు ప్రభుత్వ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి అని వారు వెల్లడించారు. బాలుడి తండ్రి నుంచి సుమారు 240 గ్రాముల లివర్ టిష్యూ సేకరించి దాదాపు 14 గంటలు సర్జరీ నిర్వహించినట్లు ఉస్మానియా ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మధుసూదన్ తెలిపారు. బాలుడి కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉన్నందున.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు చెప్పారు. ఆ చిన్నారికి అవసరమైన ఇమ్యూనోసప్రెసెంట్ మందులను జీవితాంతం ఉచితంగా అందిస్తామన్నారు. మార్పిడి తర్వాత బాలుడు కోలుకుంటున్నాడని చెప్పారు. ఈ అరుదైన చికిత్స చేసిన వైద్య బృందాన్ని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. కాగా.. ఈ చికిత్స ప్రైవేటు ఆస్పత్రిలో చేయించుకుంటే దాదాపు రూ.50-60 లక్షల దాకా ఖర్చవుతుందని అంచనా.





# 123వ డివిజన్‌లో పెండింగ్ పనులపై చర్చ

### - త్వరలో పూర్తి చేస్తామన్న జోనల్ కమిషనర్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :

జిహెచ్ఎంసి బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని 123వ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై స్థానిక నేతలు జోనల్ కమిషనర్‌ను గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ, వెంకటేశ్వర్ నగర్, విద్యానగర్, హిమగిరి నగర్ ప్రాంతాల్లో రహదారులు మరియు ఇతర మౌలిక సదుపాయాల పనులు ఆలస్యమవు తున్నాయని వివరించారు. అలాగే హైదర్ షాకోట్ నుండి బైరగూడ వరకు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ స్పందిస్తూ, అన్ని పెండింగ్ పనులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ (హైదర్ షాకోట్)లో నిలిచిపోయిన పనులను కూడా పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, అన్నం శ్రీనివాస్, ఏ-బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్ గోకరి సురేష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయి టాపర్లుగా అత్తాపూర్ విద్యార్థులు

### 548 మార్కులతో ప్రథమ స్థానంలో మహేష్, 508 మార్కులతో ద్వితీయ స్థానంలో రూపశ్రీ

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :




2025-26 విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో రాజేంద్రనగర్ మండలంలోని అత్తాపూర్ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. మండల స్థాయిలోనే అత్యధిక మార్కులు సాధించి పాఠశాల కీర్తిని పతాక స్థాయికి తీసుకెళ్లారు. తెలుగు మీడియం విభాగంలో మహేష్ 548 మార్కులు సాధించి మండల స్థాయిలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, రూపశ్రీ 508 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను పలువురు ప్రశంసించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి శ్రీలత ఘనంగా సన్మానించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజియా బేగం, గణిత ఉపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

### ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం

నల్గొండ టౌన్ ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య)





నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది మన ప్రభుత్వమే అని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అన్నారు. నార్కెట్‌పల్లి మండలం ఏనుగులదోరి గ్రామానికి చెందిన కిసాటి కృష్ణవేణి - చంద్రశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషిచేస్తానని తెలిపారు..

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ మెరుపులు

### - నవ్యశ్రీ జిల్లా టాపర్




మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా మైలర్ దేవ్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నవ్యశ్రీ 581 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడం విశేషంగా నిలిచింది.

అత్తాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మాధ్యమంలో మహేష్ 548, రూపశ్రీ 508 మార్కులు సాధించగా, ఇంగ్లీష్ మాధ్యమంలో చాందిని 521, పి. సాహితీ 495 మార్కులు పొందారు. బుద్వేల్ పాఠశాలలో గౌసియా బేగం 475, ఎం. శ్రీను 396, బి. భవిత 496, ఎస్. వర్షిత 483 మార్కులు సాధించారు.

గణేష్ నగర్ పాఠశాలలో లక్ష్మి ప్రసన్న 529, రమ్య శ్రీ 512 మార్కులు సాధించగా, మైలర్ దేవ్ పల్లిలో సమీరా 506, సానియా 496, సఫియా బేగం 551 మార్కులు పొందారు. ఎన్‌టీఆర్ నగర్ ఉర్దూ మాధ్యమ పాఠశాలలో సైమ నీఖత్ 503, సానియా బేగం 474 మార్కులు సాధించారు. పద్మశాలి పురం పాఠశాలలో హిందూ 504, బి. భార్గవి 473, ఎం. భార్గవి 531, సి.హెచ్. రక్షిత 522 మార్కులు సాధించగా, శివరాంపల్లి పాఠశాలలో శుశాంత్ 466, నందిని 509, డి. రిషి 505 మార్కులు పొందారు.

రాజేంద్రనగర్ పాఠశాలలో పి. అనురాధ 502, ఎం. వైష్ణవి 518, డి. హన్సిక 505 మార్కులు సాధించారు. టీజీఎంఆర్ గర్ల్స్ పాఠశాలలో అపూర్వ 576, శృతి 557, టీజీఎంఆర్ బాయ్స్ పాఠశాలలో ఎండీ అమన్ 560, ఎన్. జస్వంత్ 556 మార్కులు సాధించారు. ఎంజేపీటీబీసీ వెల్ఫేర్ గర్ల్స్ పాఠశాలలో నేనావత్ వైశాలి 569, ఆర్. సుమతీ 563 మార్కులు పొందారు.

ఈ సందర్భంగా మండల విద్యా అధికారి శంకర్ రాథోడ్ విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు

### జిల్లా టాపర్గా మైలర్ దేవ్ పల్లి విద్యార్థిని నవ్యశ్రీ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని మరోసారి నిరూపితమైంది. అత్తాపూర్ సర్కిల్‌లోని మైలర్ దేవ్ పల్లి డివిజన్‌కు చెందిన విద్యార్థిని ఎం. నవ్యశ్రీ ఈ ఘనతను సాధించింది. మైలర్ దేవ్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నవ్యశ్రీ, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయి ర్యాంకును సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఆమె విజయం పాఠశాలలో ఆనందోత్సాహాలను నింపగా, పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం నవ్యశ్రీను అభినందిస్తూ, ఆమె కృషి, పట్టుదల ప్రశంసనీయం అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉన్నత ప్రమాణాల విద్య అందుతున్నదని, దానిని సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు అగ్రస్థానాలను అందుకోవచ్చని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ, నవ్యశ్రీ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అభినందనలు తెలిపారు. స్థానిక నాయకులు, తల్లిదండ్రులు కూడా నవ్యశ్రీని అభినందిస్తూ, మరింత మంది విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు.

# మణికొండలో బస్ షెల్టర్ల కరువు

### ఎండలో ప్రయాణికుల అగచాట్లు!

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :



మణికొండలోని మర్రిచెట్టు నుండి శివాలయం వరకు గల ప్రధాన మార్గంలో బస్ షెల్టర్లు లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. నిత్యం వందలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మార్గంలో రోజుకు సుమారు 120 టీజీఎస్ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. అయితే, గతంలో ఉన్న బస్ షెల్టర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో ప్రయాణికులు ఎండలో, వానలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలగించిన స్థలాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికులను మరింత ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. మర్రిచెట్టు వద్ద సరైన బస్ బే లేకపోవడంతో బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ జరగడమే కాకుండా, ప్రయాణికులకు భద్రతా సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో బస్ షెల్టర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా రవాణాను ఆశ్రయించే ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ది సిటిజన్స్ కౌన్సిల్ స్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాళ అన్నారు. "ప్రజల సౌకర్యార్థం ఉన్న బస్ షెల్టర్లను తొలగించి, ఆ స్థలాలను వాణిజ్య ప్రయోజనాల కోసం కేటాయిం చడం దారుణం" అని ఆయన విమర్శించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి, మర్రిచెట్టు నుండి శివాలయం వరకు కొత్త బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని, ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# జోన్‌లో పట్టణ సమాజ అభివృద్ధి సమీక్ష

### స్వయం సహాయక సంఘాల విస్తరణకు కమిషనర్ ఆదేశాలు

### - 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" కింద 195 సంఘాలు ఏర్పాటు -- మహిళల సాధికారతపై దృష్టి

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :



జోన్ పరిధిలో గురువారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పట్టణ సమాజ అభివృద్ధి (యూసీడి ) బృందంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జోన్‌లో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటును వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచి మరిన్ని సంఘాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" కింద జోన్‌లో ఇప్పటివరకు 195 స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు వార్డ్ (విభాగం) స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. మహిళల ఆర్థిక సాధికారతలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని కమిషనర్ పేర్కొంటూ, ప్రతి అర్హ కుటుంబాన్ని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమృత్-2 సివరేజ్ ప్రాజెక్టు టెండర్లలో అవకతవకలు ఆరోపణలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ) :




గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్ మధ్య హ్యామ్ మోడ్‌లో అమృత్-2 పథకం కింద చేపట్టిన 471 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 22 సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణ టెండర్లలో అవకతవకలు జరిగాయని ది సిటిజన్స్ కౌన్సిల్ ఆరోపించింది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ, తెలంగాణ రాష్ట్ర స్థాయి హై పవర్డ్ స్టీరింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ కార్యదర్శి, రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌కు ప్రతులు పంపినట్లు తెలిపింది. కౌన్సిల్ ప్రకారం, గవర్నమెంట్ ఆర్డర్ 484 ద్వారా టెండర్ షేరింగ్ ప్యాటర్న్‌లో చేసిన మార్పులు చట్టవిరుద్ధమని, ఇవి పారదర్శకతకు భంగం కలిగిస్తున్నాయని పేర్కొంది. టెండర్ ఒప్పందంలోని హ్యామ్ ఆర్టికల్-7 ప్రకారం లీడ్ మెంబర్ కనీసం 51 శాతం వాటాను నిర్దిష్ట కాలం పాటు కొనసాగించాల్సి ఉండగా, జి.ఓ ద్వారా ఈ "లాక్-ఇన్" నిబంధనను మార్చడం ఒప్పందానికి విరుద్ధమని తెలిపింది. అలాగే ఆర్టికల్-43 ప్రకారం ఒప్పంద సవరణలు రెండు పక్షాల అంగీకారంతోనే చేయాల్సి ఉంటుందని, ఒకపక్షంగా జి.ఓ ద్వారా మార్పులు చేయడం చెల్లుబాటు కాదని అభిప్రాయపడింది. జాయింట్ వెంచర్ భాగస్వాముల టెక్నికల్ అర్హతల ఆధారంగానే టెండర్ కేటాయింపులు జరుగుతాయని, షేరింగ్ మార్పుల వల్ల టెక్నికల్ భాగస్వామి వాటా తగ్గితే అర్హతలేని సంస్థల చేతుల్లో పనులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముందస్తు అనుమతి లేకుండా చేసిన మార్పులను తర్వాత జి.ఓ ద్వారా సమర్థించడం "పోస్ట్ ఫ్యాక్టో రెగ్యులరైజేషన్" మాత్రమేనని, ఇది చట్టబద్ధం కాదని కౌన్సిల్ స్పష్టం చేసింది. టెండర్ అనంతరం షేరింగ్ మార్పులు ఇతర పోటీదారులకు న్యాయం జరగకుండా చేయడమేనని, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-14కు విరుద్ధమని పేర్కొంది.

కావున ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని చెల్లింపులను తక్షణం నిలిపివేయాలని, జాయింట్ వెంచర్ షేరింగ్ మార్పుపై స్వతంత్ర చట్టపరమైన ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. టెండర్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, లేనిపక్షంలో ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరింది. జి.ఓల ద్వారా కాంట్రాక్టు నిబంధనలు మార్చడం రూల్ ఆఫ్ లాకు విరుద్ధమని, ఈ మార్పులపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని కౌన్సిల్ అధ్యక్షుడు బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి షేక్ ఆరిఫ్ మొహమ్మద్ డిమాండ్ చేశారు.



# పదో తరగతి ఫలితాల్లో పద్మశాలిపుర జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఘన విజయం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య )





పద్మశాలి పురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన టాప్ టెన్స్ విద్యార్థులు ప్రత్యేకంగా నిలిచారు.

ఎం. భార్గవి 531 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, సి హెచ్ రక్షిత 522 మార్కులతో ద్వితీయ స్థానం, ఎం. రమ్యశ్రీ 507 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. బి. హిందూ 504, బి. భార్గవి 473, ఎ. వీరబ్రహ్మాచారి 393 మార్కులు సాధించి టాప్ టెన్‌లో చోటు సంపాదించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని పాఠశాల సిబ్బంది తెలిపారు. టాప్ టెన్స్‌గా నిలిచిన విద్యార్థుల ఫోటోలు కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ విజయంతో పాఠశాల గర్వంగా నిలిచిందని, భవిష్యత్తులో ఇంకా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నరసింహ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 30(వార్త వేదిక సూర్య)



మోండా మార్కెట్ డివిజన్ బురుగుశెట్టి బజార్ పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా నరసింహ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరికి ఆ యొక్క లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్ తదితరులున్నారు


# టైలరింగ్ కిట్లను పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 30(వార్త వేదిక సూర్య)





మోండా మార్కెట్ డివిజన్ లోని గత ఐదు సంవత్సరాల నుండి నపుద్నాన్ ఉచిత స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో జెసిఐ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలతో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు గురువారం మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ టైలరింగ్ కిట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా బ్యూటీషన్ కోర్సు శిక్షణ పొందుతున్న మహిళలకు బ్యూటీ కిట్లను అందించి ఆమె మాట్లాడుతూ... అన్ని రంగాలల్లో మహిళలు ముందుండాలని పేర్కొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ):-
దేవరకొండ మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రకంటి సునీత - శ్రీనివాస చారి కుమారుడు వివాహ వేడుకల్లో భాగంగా నేడు చింతపల్లి సాయి బాబా గుడి ఎదురుగా సాయి సుమంగళి గార్డెన్ లో జరిగిన వివాహ వేడుక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, నాయకులు ముచ్చర్ల శ్రీకాంత్, తూలచ్య నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్ పదవి విరమణ

### కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య ):-



గత 31 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో అంకితభావంతో పని చేసిన ఎందరో మన్నలు పొంది స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ గా నేడు దేవరకొండ పట్టణంలోని సాయి శివ గార్డెన్ లో పదవీ విరమణ పొందుతున్న యం. పూర్ణ చందర్ సన్మాన కార్యక్రమంలో పాల్గొని, పూర్ణ చందర్ గారి దంపతులకు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేసి, వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, దేవేందర్ నాయక్, మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ వేణుధర్ రెడ్డి,మైనార్టీ నాయకులు నజీర్ కౌన్సిలర్లు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## మహేష్ గౌడ్, జయశ్రీ ల వివాహ వేడుకల్లో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య):-



చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు కొత్తపల్లి యాదయ్య గౌడ్ కుమారుడు మహేష్ గౌడ్ -- జయశ్రీ ల వివాహం మర్రిగూడ లోని విజయ గార్డెన్ లో జరుగగా అట్టి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్తా వేదిక సూర్య):-



చింతపల్లి మండల పరిధిలోని గొడకొండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండురు శ్రీదేవి శ్రీనివాస్ గారి కూతురు ప్రియాంక -- సాయిసంశయ్ వివాహం హైదరాబాద్ లోని పెద్ద అంబర్ పేట్ సమీపాన గల నిది కన్వెన్షన్ సెంటర్లో జరుగగా అట్టి కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సేవకు వారసత్వం





## డీజీపీ బి. శివధర్ రెడ్డికి భావోద్వేగ వీడ్కోలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య) :
తెలంగాణ పోలీస్ విభాగంలో ఒక శకం ముగిసింది. మూడు దశాబ్దాల పాటు అత్యున్నత సేవా విలువలతో, అంకితభావంతో పనిచేసిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి, ఇవాళ పదవీ విరమణ చేశారు. హైదరాబాద్‌లోని టీజీపీఏ పరేడ్ మైదానంలో నిర్వహించిన వీడ్కోలు పరేడ్, ఆయన సుదీర్ఘ ప్రస్థానానికి సముచితమైన గౌరవ నివాళిగా నిలిచింది. టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరేడ్‌ను శ్రీ మనన్ భట్ కమాండ్ చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్లు, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లు మరియు మౌంటెడ్ కంపెనీకి చెందిన దళాలు ప్రదర్శించిన విన్యాసాలు, పోలీస్ వ్యవస్థలోని క్రమశిక్షణను ప్రతిబింబించాయి.



ఈ కార్యక్రమానికి పోలీసు ఉన్నతాధికారులతో పాటు, రిటైర్డ్ అధికారులు, పోలీస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శివధర్ రెడ్డి కెరీర్, పోలీసింగ్ వ్యవస్థలో వచ్చిన మార్పులకు నిదర్శనం. విశాఖపట్నం, నల్గొండ వంటి ప్రాంతాల్లో ఆయన చేసిన సేవలు, నక్సలైట్ల వ్యతిరేక చర్యల్లో కీలక పాత్ర పోషించాయి. ఆంధ్రా-తెలంగాణ మోడల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడంలో ఆయన కృషి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలంతో పాటు పోలీసింగ్ ఎలా మారిందో గుర్తుచేశారు. శిక్షణ ప్రాధాన్యత నుంచి నేడు ఎ ఐ , డేటా అనలిటిక్స్, సైబర్ క్రైమ్ నివారణ వంటి ఆధునిక పద్ధతుల వైపు పోలీసింగ్ మళ్లింది. షి టీమ్స్, 'హాక్ ఐ' వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజలకు చేరువయ్యే విధానంపై ఆయన స్పష్టం చేశారు. తన వీడ్కోలు ప్రసంగంలో శివధర్ రెడ్డి సహచరులకు, గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ, యువ అధికారులకు కీలక సందేశాన్ని అందించారు. "నిజాయితీతో నాయకత్వం వహించండి, మీ బృందాన్ని ప్రోత్సహించండి. అధికారాన్ని ప్రజల పట్ల సహానుభూతితో (ఏంపతీ ) ఉపయోగించండి" అని ఆయన కోరారు. 'ఫ్యూచర్ రెడీ పోలీసింగ్' (ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ ) దిశగా తెలంగాణ పోలీసులు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీపీ (హెచ్ఓ పి ఎఫ్ ) డిజిగ్నేట్ సి.వి. ఆనంద్ పాల్గొన్నారు. శివధర్ రెడ్డి పదవీ విరమణ కేవలం ఒక అధికారి నిష్క్రమణ మాత్రమే కాదు, నిబద్ధత మరియు క్రమశిక్షణతో కూడిన ఒక సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు. ఆయన అందించిన స్ఫూర్తి, తెలంగాణ పోలీస్ వ్యవస్థలో భవిష్యత్తులో కూడా ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని తోటి అధికారులు అభిప్రాయపడ్డారు.

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు



### అదే రేపటి తరం తలరాతను మారుస్తుంది"

### విద్యతోనే సమాజం ఎదుగుతుంది.

### విద్యార్థుల భవిష్యత్ బలపడే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

### ఆర్ అండ్ బి శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి



దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్తా వేదిక సూర్య ):-
దేవరకొండ నియోజకవర్గంలోని కొండల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ గ్రామ రైతు వేదిక వద్ద 20 ఎకరాల్లో 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర =ఉదీ శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ గారితో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ మా ప్రభుత్వం "విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం" అన్న నమ్మకంతో, రాష్ట్రంలోని విద్యావ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోంది. దేవరకొండలో నిర్మిస్తున్న ఈ స్కూల్ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా, ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని అన్నారు ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో, దేవరకొండలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకొని రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారితో కలిసి ప్రారంభం చేసుకుందాం అని అన్నారు విద్యార్థులు, ఉపాధ్యాయులు క్యాంపస్‌లోనే ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, క్రీడా కార్యక్రమాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని ఈ సమగ్ర ఇంటిగ్రేటెడ్ స్కూల్ మోడల్ తెలంగాణ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం పనులు వేగంగా సాగేందుకు ప్రతి 15 రోజులకు నిధులు విడుదల చేస్తున్నాం అని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే డైట్ చార్జీలను 40%, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నాం ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నాం గ్రామీణ రహదారి సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని, అలాగే స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఇది ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవరకొండలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని 200 పడకలుగా చేయాలని మంత్రి గారిని కోరారు దేవరకొండలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేసి రైతంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది కొండమల్లేపల్లి గ్రామంలోని కస్తూర్భ గాంధీ బాలికల విద్యాలయంలో 80. 00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి రామ్మోషన్,మన్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు,వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్లు నాయిని జమున మాధవరెడ్డి, దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఆర్డీవో రమణా రెడ్డి డి ఈ ఓ కోల్ ముంతల్ పహాడ్ గ్రామ సరస్వతి రవినాయక్ ,సర్పంచ్ యుగేందర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ మెగా ఇంజనీరింగ్ సంస్థ లక్ష్మారెడ్డి, ఎస్ ఇ ఏస్ ,ఉ ఈ డబ్ల్యు ఐ డి సి నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేట్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు,మండల పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు





## ఎస్ ఎస్ సి ఫలితాలలో మండల టాపర్ గా జెడ్ పి హెచ్ ఎస్ చందంపేట విద్యార్థి జే దేవేందర్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్తా వేదిక సూర్య):-
పదవ తరగతి ఫలితాల్లో చందంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రధానోపాధ్యాయురాలు పి.లీలారాణి హర్షం వ్యక్తం చేశారు పాఠశాలలోని జె దేవేందర్ 535 మార్కులతో మండల టాపర్ గా నిలిచాడు తను చదువుతోపాటు క్రీడలు, క్రమశిక్షణలో ఉత్తమ విద్యార్థిగా పేరు పొందాడని అదేవిధంగా జి .నందిని 507 మార్కులు, ఎం .ధనలక్ష్మి 501 మార్కులు సాధించారని తెలిపారు విద్యార్థులు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులచే బోధన, క్రీడలు, క్రమశిక్షణ, డిజిటల్ క్లాస్ రూమ్ తరగతులు వంటి వసతులు కల్పించడం వల్లనే మేము ఈ ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు అదేవిధంగా గత సంవత్సరం నవంబర్ నెల నుండి పరీక్షలు ముగిసే అంతవరకు ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం స్నాక్స్ ద్వారా పౌష్టికాహారాన్ని అందించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ మేము ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాత్ర పోషించారని వారికి మా పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు చందంపేట మండల టాపర్ గా నిలిచిన దేవేందర్ కి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాధ మరియు ఉప సర్పంచ్ జబ్బు శ్రీశైలం గారిచే సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎం చంద్రశేఖర్ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసినటువంటి ఉపాధ్యాయులు గోవిందు కొండయ్య , జోసఫ్ చౌదరి చింతకాయల రామచంద్రు , నెనావత్ విజయ లింగంపల్లి మధు డాక్టర్ తగుళ్ళ వెంకట్ మరియు బైరోజు సంధ్యారాణి విద్యార్థులను ఆశీర్వదించారు

## బాలికపై అత్యాచారయత్నం కేసులో దోషికి ఏడేండ్ల జైలు శిక్ష తో పాటు రూ.4 వేల జరిమానా

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య )



బాలికపై అత్యాచారయత్నం కేసులో దోషిగా తేలిన వ్యక్తికి నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధించింది. కేసు వివరాలు.. ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన ఉప్పుతల దుర్గాప్రసాద్ నాగార్జునసాగర్‌కు చెందిన మహిళను వివాహం చేసుకోవడం జరిగింది. ఆ మహిళకు గతంలోనే వివాహం జరిగి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సదరు మహిళ భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోగా దుర్గా ప్రసాద్‌ను ఆమె రెండో వివాహం చేసుకుంది. వివాహం అనంతరం ఇరువురు ఈ ఇద్దరు కూతుర్లను తీసుకుని బతుకుతెరువు కోసం కోళ్ల ఫారంలో పని చేయడానికి నార్కట్‌పల్లి మండలం కొండపాకొనిగూడెం వెళ్లారు. 20 ఏప్రిల్ 2018 న దుర్గాప్రసాద్ తన భార్య రెండవ కూతురు 14 ను సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో తన బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. కొండపాకొనిగూడెం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ దగ్గర వాహనం ఆపి సదరు బాలికను చెట్లపొదల్లోకి లాక్కొనిపోయి అత్యాచారం చేసే ప్రయత్నం చేశాడు.బాలిక గట్టిగా కేకలు వేసి పరిగెత్తుకుంటూ ఇంటికి వచ్చింది. జరిగిన విషయం తన తల్లికి చెప్పడంతో ఆమె తన భర్త అయిన దుర్గాప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని 21 ఏప్రిల్ 2018 న నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుదీర్ఘ విచారణ అనంతరం గురువారం నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం దుర్గాప్రసాద్‌న్ దోషిగా తేల్చుతూ 7 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4 వేల జరిమానా విధించింది. బాధిత బాలికకు రూ.2 లక్షల కంపెన్సేషన్ ప్రకటించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సరైన సాక్షాలను ప్రవేశపెట్టి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. సమగ్రమైన దర్యాప్తు చేయడంలో ఆనాటి నార్కట్‌పల్లి ఎస్‌హెచ్ఓ కె.గోవర్ధన్, ప్రస్తుత ఎస్‌హెచ్ఓ విష్ణు కీలకపాత్ర పోషించారు. సీడీఓలు నరసింహ, కిరణ్, భరోసా లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన ఈ కేసు పురోగతి సాధించడానికి సహకరించారు.



## మేడే వాడ వాడల ఘనంగా నిర్వహించాలి : సిఐటియు

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య )

ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా తిప్పర్తి మండలం లో అన్ని గ్రామాల లో ఎర్రజెండాలు ఎగురవేయాలని సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ పిలుపునిచ్చారు. గురువారం తిప్పర్తి మండలం లో మార్కెట్ యార్డులో హమాలి వర్కర్స్ మరియు వివిధ రంగాల కార్మికులను కలిసి సమావేశం నిర్వహించి మేడే సందర్భంగా తిప్పర్తి మండల కేంద్రంలో ర్యాలీ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానం కోసం కార్మిక హక్కుల కోసం జరిగిన మహత్తరమైన పోరాటం అమరవీరుల స్ఫూర్తితో అవతరించిన ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. నేటి పాలకులు కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న బిజెపి విధానాలపై రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా తిప్పర్తి మార్కెట్ యార్డ్ నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సెంటర్లో బహిరంగ సభ ఉంటుందని ఈ బహిరంగ సభకు కార్మికులు కర్షకులు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ప్రతివాడల్లో గ్రామాలలో ఎర్ర జెండాలు ఎగురవేసి ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి రవి యాదయ్య భద్రయ్య మహేష్ బిక్షం లక్ష్మయ్య దినేష్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పోరెడ్డి సత్తిరెడ్డి వర్ధంతి

గట్టుప్పల.ఏప్రిల్ 30.వార్త వేదిక సూర్య:



గట్టుప్పల మండల కేంద్రంలో సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ పోరెడ్డి సత్తిరెడ్డి 5వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం టౌన్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ పోరెడ్డి సత్తిరెడ్డి చిన్నతనం నుండే భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ రైతాంగ పోరాట నాయకత్వం వహించిన నాయకులతో సంబంధాలు ఏర్పరచుకొని ఎర్రజెండా పక్షాన పేదలకు న్యాయం జరగాలని అనేక ప్రజా పోరాటాలు పాల్గొంటూ అన్నాడు రజాకార్ మోకాలు పార్టీ రహస్యం చెప్పమని సత్తిరెడ్డి గారిని చిత్రహింసలు పెట్టిన పార్టీ రహస్యాన్ని పార్టీ నాయకులను కాపాడిన గొప్ప ధైర్యశాలి కామ్రేడ్ సత్తిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం నాయకులు కొనియాడారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎండి రబ్బాని, టౌన్ కార్యదర్శులు కర్నాటి సుధాకర్, పెద్దగాని నరసింహ ,కర్నాటి వెంకటేశం, నాయకులు ఖమ్మం రాములు, ముసుకు బుచ్చిరెడ్డి ,గుమ్మికొండ యాదిరెడ్డి,నల్లవెల్లి బిక్షం, పసుపుల చెన్నయ్య, బొబ్బల చంద్రయ్య, దుబ్బాక శంకరయ్య, కర్నాటి యాదయ్య ,తదితరులు పాల్గొన్నారు

## మెండె డ జక్కుల వారి వివాహ వేడుకలో పాల్గొన్న దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య):-



చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన మెండె మల్లయ్య యాదమ్మ గారి కుమారుడు ఆంజనేయులు అనిత గార్ల వివాహానికి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,ధేన్యతండ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి,ధరణిపతి రమణారావు,సోనగంటి గొవర్ధనాచారి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రు రామారావు,ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్,కాయితి బచ్చిరెడ్డి,మర్రు జనార్ధన్ రావు,శివర్ల పర్వతాలు,మాదగోని కృష్ణ గౌడ్,రెడ్డి పరమేష్,రాశిక పాండయ్య,వలమోని యాదగిరి,తదితరులు పాల్గొన్నారు

## మల్లపురాజుపల్లి గ్రామంలో బెల్టు షాపులు, నాటుసారాయి నిర్మూలన

### మన కుటుంబాల సౌభాగ్యం...గ్రామ ప్రశాంతత కోసం
### గ్రామ అభివృద్దే మన లక్ష్యం...మద్యపానానికి దూరంగా ఉందాం...
### సర్పంచ్ మంటిపల్లి మణిమాల శ్రీశైలం



నాంపల్లి ఏప్రిల్ 30(వార్త వేదిక సూర్య)

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామంలో పంచాయతీ ఆవరణలో సాధారణ గ్రామసభ సర్పంచ్ మంటిపల్లి మణిమాల శ్రీశైలం గారి అధ్యక్షతన నిర్వహించి గ్రామంలోని బెల్టు షాపులు మరియు నాటుసారాయి దుకాణాలు నిర్మూలన చేయాలనీ అందరి సమక్షంలో తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మంటిపల్లి మణిమాల శ్రీశైలం గారు మాట్లాడుతూ మద్యం విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో లభిస్తుండడంతో స్థానిక యువకులు మద్యానికి బానిసలవుతున్నట్లు తెలిపారు. పలువురు రోగాలు, ప్రమాదాల భారిన పడుతున్నట్లు వెల్లడించారు. నాటుసారా, మద్యం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి అని మండి పడ్డారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా మద్యం మరియు నాటుసారాయి అమ్మితే 25 వేల రూపాయలు ఫైన్ మరియు చట్టభద్ధంగా చర్యలు,అదేవిదంగా మద్యం అమ్ముతున్నారు అని పట్టించినందుకు గాను వారికి 5 వేల రూపాయలు బహుమతిని ప్రకటించారు. సోమవారం నుండి గ్రామంలో పూర్తిగా బెల్టు షాపులు మరియు నాటుసారాయి నిర్మూలన చేసి గ్రామ అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, బెల్టు షాపుల నిర్వహాకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గజ్జల యాదగిరిరెడ్డి,వార్డు మెంబెర్స్ గొడ్డటి ఈదమ్మ, గొడ్డటి ముత్యాలి,చెన్నోజు గోవిందమ్మ, కనకటి శేఖర్,పల్లెటి వినోద్,సెక్రటరీ శంకర్ గ్రామ సంబంధిత అధికారులు, సిబ్బంది,మహిళలు,యువకులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ జనరల్ ఫండ్స్ అకౌంట్ ఫ్రీజింగ్ ను ఎత్తివేయాలి



### సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

దేవరకొండ ఏప్రిల్ 30 ( వార్తా వేదిక సూర్య ):-

కొండమల్లేపల్లి పట్టణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించండిలనీ కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ జనరల్ ఫండ్స్ అకౌంట్ ఫ్రీజింగ్ ను ఎత్తివేయాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. మేజర్ గ్రామపంచాయతీ కావడంతో అకౌంట్లో డబ్బులు ఉన్న పనులు చేయలేకపోతున్నామని ఆయన అన్నారు. అకౌంట్ ఫ్రీజింగ్ ఎత్తివేస్తే గ్రామపంచాయతీ పాలకవర్గం,అధికారుల తీర్మానం ప్రకారం అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మేజర్ గ్రామపంచాయతీ అయిన కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని వినతి పత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారిని కోరినట్లు ఆయన పేర్కొన్నారు కొండమల్లేపల్లి పట్టణం అభివృద్ధి చేయడమే తన ముందున్న ఏకైక లక్ష్యం అని ఆయన అన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానన్నారు

## విద్య పైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది



### రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

దేవరకొండ ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య )

గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని కొండమల్లేపల్లి శివారులో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా టోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, పేదలకు వీటిని అందించేందుకు పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళుతున్నదని ,ఇందులో భాగంగానే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు చెప్పారు . రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 23,000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, 29 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 18 లక్షల 50 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యతోపాటు, అన్ని ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని ,ఎక్కడ విద్య ఉంటే అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో దేవరకొండకు తాగు ,సాగు నీటి సౌకర్యాలకు కృషి చేయడం జరిగిందని, ఎస్ఎల్బీసీ సొరంగం, పెల్లిపాకల రిజర్వాయర్ ,నక్కలగండి, డిండి ప్రాజక్ట్ కింద చింతపల్లి, గోపనపల్లి రిజర్వాయర్లు, 18 కిలోమీటర్ల లింక్ కెనాల్ పూర్తి చేయాల్సి ఉందని, దీని ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుందని ,డిండి ప్రాజెక్టు పూర్తి అయితే రానున్న రెండేళ్లలో దేవరకొండ సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. నియోజకవర్గానికి సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానని, పెల్లిపాకల,అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అన్ని స్థాయిలో ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు,, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే విద్య ఒక్కటే మార్గమని, భావించి రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలతో ప్రతి నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా 2563 మంది విద్యార్థులు ఒకే చోట చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని చెప్పారు. కొండమల్లేపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పేమెంట్ లకు ఎలాంటి ఇబ్బంది లేదని, నల్గొండలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఇప్పటివరకు 20 కోట్ల రూపాయలు చెల్లించినట్లు ఆయన తెలిపారు .దీంతోపాటు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సైతం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, ఈ పాఠశాలకు ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా బస్సులను విద్యార్థుల ఇళ్ల వద్దకు పంపించి బస్సుల ద్వారా వారిని పాఠశాలకు తీసుకువచ్చి తిరిగి ఇళ్ల వద్ద దింపడం జరుగుతుందని అన్నారు. అవసరమైన చోట దశలవారిగా పాఠశాలలను కట్టించడం జరుగుతుందని అన్నారు. నెరేడుగొమ్ము లో 132/1నెజ సబ్ష్టేషన్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని మంత్రి ట్రాన్స్కో సీఎం డి తో ఫోన్లో మాట్లాడి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నల్గొండ నుండి డిండి వరకు 324 కోట్ల రూపాయలతో నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నామని, దేవరకొండ నియోజకవర్గం లో 74 కోట్ల రూపాయలతో కొన్ని రోడ్లను చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద అవసరమైన వారికి వారం రోజుల్లో ఎల్ఓసి లు ఇప్పించడం జరుగుతున్నదని , దేవరకొండ నియోజకవర్గంలో ఆరోగ్యశ్రీ కింద పది కోట్ల రూపాయలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి 13 వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలవడం జరిగిందని, ఈ వారంలో అగ్రిమెంట్ పూర్తి చేసుకుని మేలో పనులు చేపట్టనున్నామని తెలిపారు .అలాగే ఉస్మానియా ఆస్పత్రి, హైకోర్టు బిల్డింగులు చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. బ్రాహ్మణ వెల్లేముల ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు సాగునీరు అందిస్తున్నామని, దేవరకొండ నియోజకవర్గానికి తాగునీటి సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా నీరు అందించే విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతానని, అదేవిధంగా నేరేడు గోమ్మ 132/11 కెవి సబ్ స్టేషన్ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా ఒకే పాఠశాలలు అందరు చదివే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని అన్నారు. అన్నింటికంటే విద్యాభివృద్ధి గొప్పదని , ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పూర్తయితే యూనివర్సిటీ వాతావరణం ఉంటుందని, 2563 మంది పిల్లలు ఒకే దగ్గర చదువుకోవచ్చని, దేవరకొండ , కొండమల్లేపల్లి లను సమానంగా అభివృద్ధి చేసి రెండింటిని విలీనం చేయడమే తన లక్ష్యమని, అందుకే కొత్తగా వచ్చిన ఆసుపత్రులు , ఇతర ప్రభుత్వ సంస్థలను దేవరకొండ కొండమల్లేపల్లి మధ్యలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్లో ఉన్న ఎంవి ఐ ఆఫీసును మంజూరు చేయాలని ,అలాగే 20 పడకల ఆసుపత్రి పూర్తిచేయాలని కోరారు .దేవరకొండ నియోజకవర్గం లో తాగునీటికి ఇబ్బంది ఉందని డిండి నుండి దేవరకొండకు నీరిచ్చే 90 కోట్ల రూపాయల ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని, దీన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని, అలాగే దేవరకొండ జూనియర్ కళాశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి జైపాల్ రెడ్డి పేరు పెట్టి విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఇదివరకే నియోజకవర్గంలో 5 కేజీ బి వి లు,ఐదు మోడల్ స్కూల్స్ తీసుకురావడం జరిగిందని, కేజీబీలన్నింటికీ కాంపౌండ్ వాల్ తీసుకొచ్చామని, పెల్లి పాకాల రిజర్వాయర్ రీడిజైనింగ్ అంచనాలతో క్యాబినెట్ అనుమతిస్తే నియోజకవర్గం లో సాగునీటికి ఇబ్బంది లేదని, నక్కలగండి ప్రాజెక్టుకు సంబంధించి అటవీ అనుమతులు క్లియర్ చేయించాలని, డిండి ప్రాజెక్టు కు గతంలో ఇచ్చిన జీవో ప్రకారమే పనులు చేపట్టాలని, నియోజకవర్గంలో హ్యాం రోడ్ల ద్వారా 70 కోట్ల రూపాయలతో పనులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని నేరేడు గోమ్మ లో132/11 కెవి సబ్ స్టేషన్ మంజూరు దశలో ఉన్నందున తక్షణమే మంజూరు చేయించాలని, కొండపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించడం జరుగుతున్నదని, రెసిడెన్షియల్ విధానంలో 2563 మంది విద్యార్థులు ఒకేదగ్గర చదువుకోవచ్చని, చదువుతోపాటు, వివిధ రకాల కార్యక్రమాలను కూడా ఈ పాఠశాలలో నేర్పించడం జరుగుతుందని, విద్యార్థిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రత్యేకించి మారుమూల గిరిజన ప్రాంత విద్యార్థులకు కొండమల్లేపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు .

ఈ డబ్ల్యూ ఐ డి సి ఎస్ ఈ బాల ప్రసాద్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, డీఈవో, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## పెద్ద మునిగల్ మాజీ ఎంపీటీసీ కుటుంబానికి అర్ధిక సహాయం అందజేథ బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య ):-

నల్లగొండ జిల్లా నేరేడుబొమ్మ మండలంలోని పెద్దమునిగల్ మాజీ ఎంపిటిసి రాసోజు రామాచారి సతీమణి శైలజ ఇటీవల మరణించడం జరిగింది రామాచారి కి దేవరకొండ బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ 10,000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు ఈ కార్యక్రమం లో పెద్ద మునిగల్ సర్పంచ్ కేతావత్ రవీందర్ నాయక్, ఎలుక రాములు, కుంభం అంకాలు, కేతావత్ జగన్, కుంభం నరేష్, కేతావత్ రాములు, జామల్పూరి విరోజీ , ఉగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ బి ఐ ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్ దేవరకొండలో ఘనంగా ప్రారంభోత్సవం

దేవరకొండ ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య ):-










దేవరకొండ కేంద్రంలో గురువారం రోజున డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డి ఎం డి. ఎస్. రాధాకృష్ణన్ ఎస్ బి ఎస్ ఓ బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయని ప్రారంభించినా రు అధ్యక్షులు ఎన్ వి టి , ప్రధాన కార్యదర్శి రాజు కుమిరిశెట్టి మరియు ఓబీసీ ఎంప్లాయిస్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమానికి +వీం జి ఎం ఎస్ , సి డి ఓ గారు, ఆఫీసర్ అసోసియేషన్, అవార్డ్ స్టాప్ యూనియన్, ఎస్ సి ఎస్ టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఇతర ఆఫీస్ బేరర్స్ లేడీ కామ్రేడ్స్ ప్రతి ఒక్కరూ హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని అందరు పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్క మెంబెర్ కి పేరుపేరునా ధన్యవాదాలు




# ఆస్తి పన్ను వసూళ్లు రూ. 252కోట్లు

### 5 శాతం రిబేటుతో వసూళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 30(వార్త వేదిక సూర్య) :**
స్థానిక సంస్థల్లో ఆస్తి పన్ను వసూళ్లు రూ. 252 కోట్లకు చేరుకున్నాయి. 5% రిబేటుతో బకాయిలు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఈ ఆర్థిక ఏడాదిలో రూ. 1,667కోట్లు అంచనా వేసుకోగా 132 పట్టణ స్థానిక సంస్థలనుంచి ఇప్పటివరకు రూ. 252కోట్లు వసూలయ్యాయి. అత్యధికంగా గ్రేటర్ వరంగల్‌లో రూ. 29కోట్లు, కరీంనగర్‌లో రూ. 17.70కోట్లు, నిజామాబాద్‌లో రూ. 14కోట్లు, ఖమ్మంలో రూ. 11.16కోట్లు, మహబూబ్ నగర్‌లో రూ. 10.16కోట్లను వసూలు చేసింది.
మున్సిపాలిటీల్లో మొయినాబాద్ 58శాతం అర్జించగా, గడ్డపోతారం 53.70%, జమ్మికుంట 49%, హుజూరాబాద్ 45%, మూడుచింతలపల్లి 37% లక్ష్యం చేరాయి. మరో 20 పట్టణ స్థానిక సంస్థలు 25% కంటే తక్కువ వసూళ్లు సాధించగా, కొత్తగా ఏర్పడిన మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట వంటి మున్సిపాలిటీలు ప్రగతిని సాధించాయి. భూపాలపల్లి, కోహీర్, కేసముద్రం, బోధన్, కల్వకుర్తి, వేములవాడ, సదాశివపేట, ఆదిలాబాద్‌లో 10% కంటే తక్కువ పన్ను వసూలయ్యాయి.

# కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు

### భారీగా అవకతవకలు ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య)**
తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసుల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. గురువారం సాయంత్రం నుంచి హైదరాబాద్ రూరల్, పంజాగుట్ట, బేగంపేట డివిజన్లలోని కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా అవకతవకలను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది.
మూడు డివిజన్లలో భారీగా ట్యాక్స్ ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరు సర్కిళ్లలోనే రాత్రి వరకూ సోదాలు జరిగాయి. బోయినపల్లి, ఖైరతాబాద్, సోమాజిగూడ, జీడిమెట్ల-2 తదితర సర్కిళ్లలో అధికారులు అర్ధరాత్రి వరకూ సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అవకతవకలకు సంబంధించిన పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

# డీజే సౌండ్ తట్టుకోలేక 140 కోళ్లు మృతి!

### డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు..

### యూపీలో ఘటన



లక్నో, ఏప్రిల్ 30 : ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో పెండ్లి ఊరేగింపులో పెట్టిన డీజే సౌండ్‌ను తట్టుకోలేక 140 కోళ్లు చనిపోయాయి. పౌల్ట్రీఫామ్ యజమాని ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుల్తాన్‌పూర్ జిల్లా బల్దిరాయ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దరియాపూర్ గ్రామంలో సబీర్ అలీ అనే వ్యక్తి కోళ్లఫామ్ నిర్వహిస్తున్నాడు. ఏప్రిల్ 25వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో వివాహ ఊరేగింపు ఆయన కోళ్లఫామ్ పక్కనుంచి వెళ్లింది.
ఈ ఊరేగింపులో డీజే నుంచి వచ్చిన తీవ్రమైన శబ్దాలకి పౌల్ట్రీఫామ్‌లోని కోళ్లు భయంతో వణికిపోయాయని యజమాని సబీర్ అలీ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సౌండ్‌ను తట్టుకోలేక 140 కోళ్లు మృతి చెందాయని తన బాధను వెళ్లగక్కాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు డీజే ఆపరేటర్ కవి యాదవ్, మరికొందరిపై కేసు నమోదుచేశారు. కోళ్ల మృతికి నిజంగానే డీజే సౌండ్ కారణమా? లేదా మరేదైనా కారణమా? అనే విషయాన్ని పోలీసులు తేల్చనున్నారు.

# ట్రంప్ ప్రకటనతో మళ్లీ భగ్గుమంటున్న చమురు ధరలు..



అమెరికా హర్మూజ్‌ను దిగ్బంధించడంతో చమురు ధరలు పెరిగాయని ట్రంప్ యంత్రాంగాన్ని ఉద్దేశించి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ వ్యంగ్యంగా స్పందించారు. మూడు రోజుల్లో ఇరాన్ చమురు బావులు పేలుతాయని ఏప్రిల్ 26న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేశారు. 'మూడు రోజులు అయింది. అలాంటిది ఏమీ జరగలేదు. దానిని 30 రోజులకు పొడిగించి, ప్రత్యక్ష ప్రసారం చేయండి ' అని ఘాలిబఫ్ ఓ పోస్టులో ఎద్దేవా చేశారు. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్ వంటివారు దిగ్బంధనం వంటి సలహాలను ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే చమురు ధర ఒక బ్యారెల్‌కు 120 డాలర్లు దాటింది. నెక్స్ట్ స్టాప్ 140 డాలర్ల వద్ద ఉంటుంది అని రాసుకొచ్చారు. కాగా దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హర్మూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ పట్టుబడుతోంది. అయితే ఆ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. అతి త్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తామని, అది వారిని తీవ్రంగా భయపెట్టనుందని ఇరాన్ ప్రకటించింది. అది వారి పక్కనే ఉందని, దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చని ఇరాన్ హెచ్చరికలు చేసింది. దాంతో రెండు దేశాల ఘర్షణలు ఏ స్థాయికి చేరుకుంటాయోనని ఆందోళన వ్యక్తమవుతోంద్.

ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించడంతో చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇరాన్ అణుఒప్పందం చేసుకునే వరకు హర్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడంతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దాంతో అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 6 శాతం పెరిగి 120 డాలర్లు దాటింది. 2022 తర్వాత చమురు ధరలు ఇంతగా పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గురువారం ఒక దశలో చమురు ధర బ్యారెల్ 125 డాలర్లకు కూడా ఎగబాకింది.

# తమిళనాడులో కొత్త కూటమి..

### టీవీకేతో పొత్తు కోసం ఏఐఏడీఎంకే ప్రయత్నాలు

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీల్ని కలవరపెడుతున్నాయి. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తమిళనాడులో ఏఐఏడీఎంకే కూటమి.. విజయ్ టీవీకే పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. యాక్సిస్ మై ఇండియా సహా కొన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం.. విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ 98--120 సీట్లు సాధించే అవకాశాలున్నాయి.
అంటే మెజారిటీకి కాస్త అటూ, ఇటుగా సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇతర సంస్థల సర్వేలు భిన్నంగా ఉన్నప్పటికీ.. విజయ్ పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఒకవేళ యాక్సిస్ మై ఇండియా సంస్థ సర్వే నిజమే అయితే, విజయ్ తమిళనాడులో కింగ్ మేకర్‌గా లేదా కింగ్‌గా కూడా మారగలడు. అందుకే ముందు జాగ్రత్తగా ఏఐఏడీఎంకే విజయ్ టీవీకేతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే విజయ్ పార్టీ టీవీకేతో కలిసి అధికారం పంచుకునేందుకు చర్చలు జరపాలని ఏఐఏడీఎంకే నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. యాక్సిస్ మై ఇండియా సంస్థ ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం.. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 98--120 సీట్లు సాధించే ఛాన్స్ ఉంది. ఈ పార్టీకి 37 శాతం ఓటింగ్ రావొచ్చు.
యువత, నిరుద్యోగులు ఈ పార్టీకి అండగా నిలిచారని సర్వే చెబుతోంది.



ఇక అధికార డీఎంకే, కాంగ్రెస్ కూటమికి 92--110 సీట్లు రావొచ్చు. ఏఐఏడీఎంకే ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమికి 22--32 సీట్లు రావొచ్చు. అధికారం చేపట్టాలంటే 118 సీట్లు అవసరం. ఈ నేపథ్యంలో డీఎంకే కూటమి కాకుండా విజయ్ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే ఏఐఏడీఎంకేతో పొత్తు ఉండే అవకాశం ఉంది. మే 4న ఫలితాల విడుదల తర్వాత అసలు సంగతి తేలనుంది.

# మలేరియాతో పోరాడుతూ షూటింగ్ పూర్తి చేసిన దీపికా..

### 16ఏళ్ల నాటి విశేషాలు వెల్లడించిన లారా దత్తా

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె వృత్తిపట్ల ఉన్న అంకితభావానికి మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. 2010లో విడుదలైన హౌస్‌ఫుల్ సినిమా షూటింగ్ సమయంలో ఆమె ఎదుర్కొన్న కష్టాలను సహనటి లారా దత్తా తాజాగా బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.లారా దత్తా తెలిపిన వివరాల ప్రకారం, ఇటలీలో జరుగుతున్న షూటింగ్ సమయంలో దీపికా పదుకొణె మలేరియా బారిన పడ్డారు. తీవ్రమైన జ్వరంతో, శారీరకంగా బలహీనంగా ఉన్నప్పటికీ సినిమా పనులు ఆగకూడదనే ఉద్దేశంతో ఆమె సెట్స్‌కు హాజరవుతూ తన భాగం షూటింగ్ పూర్తి చేశారు. ఆమెకు విపరీతమైన జ్వరం ఉన్నా, ఒళ్లు వణికిపోతున్నా ఒక్కసారి కూడా అసహనం చూపలేదు. కెమెరా ముందు నిలబడినప్పుడు మాత్రం ఎక్కడా అలసట కనిపించేది కాదు" అని లారా పేర్కొన్నారు. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్ చిత్రీకరణలో కూడా దీపిక తన పూర్తి శక్తిని పెట్టి నటించిందని ఆమె తెలిపారు.
సెట్స్‌లో ఉన్న చిత్రబృందం దీపిక ఆరోగ్య పరిస్థితిని గమనించి వైద్య సదుపాయాలు కల్పించినప్పటికీ, ఆమె విశ్రాంతి తీసుకోవడంపై కన్నా షూటింగ్ పూర్తి చేయడానికే ప్రాధాన్యత ఇచ్చిందని వెల్లడించారు. షాట్‌ల మధ్యలో మందులు వేసుకుని కాస్త విశ్రాంతి తీసుకుని, మళ్లీ కెమెరా ముందు నిలబడేదని చెప్పారు. ఈ సమయంలో అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్ వంటి సహనటులు ఆమెకు పూర్తి మద్దతు ఇచ్చారని లారా గుర్తుచేశారు. అయితే దీపిక చూపిన పట్టుదల మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచిందని తెలిపారు. దీపికా పదుకొణె కేవలం అందంతోనే కాదు, క్రమశిక్షణ, పనిపట్ల ఉన్న నిబద్ధతతోనే ఈరోజు గ్లోబల్ స్టార్‌గా ఎదిగిందని లారా ప్రశంసించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తాను ఒప్పుకున్న పనిని పూర్తి చేయాలనే లక్ష్యం ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతుందని చెప్పారు.
దాదాపు 16 ఏళ్ల క్రితం జరిగిన ఈ సంఘటన, నేటి యువ నటీనటులకు స్ఫూర్తిదాయకమని చెప్పొచ్చు. వెండితెరపై కనిపించే గ్లామర్ వెనుక ఎంత కష్టం దాగి ఉంటుందో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. ఇక దీపికా పదుకొణే త్వరలో మరోసారి పండంటి బిడ్డకు జన్మనివ్వనుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ రాకా చిత్రంతో పాటు పలు క్రేజీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ అలరిస్తుంది.

# రేవంత్ రెడ్డి పాలనలో పోలీసు డిపార్ట్‌మెంట్ బలి : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్




హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పోలీసు డిపార్ట్‌మెంట్ బలి అవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కేసులో 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని విమర్శించారు. ఛార్జ్ షీట్‌లో బీఆర్ఎస్ నాయకుల పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు.ఒక సీనియర్ జర్నలిస్టును ఇరికించి, అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తే బీఆర్ఎస్ నాయకుల పేర్లు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

# భారతీయ ఉద్యోగిపై లైంగిక వేధింపులు!

### జేపీ మోర్గాన్ అధికారిణిపై బాధితుడి కేసు

### ఆరోపణలను ఖండించిన బ్యాంక్

**న్యూఢిల్లీ :** జేపీ మోర్గాన్ చేస్ బ్యాంక్‌లో పనిచేసే ఓ సీనియర్ మహిళా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తనపై పలుమార్లు లైంగిక దాడి చేసిందని అదే కంపెనీకి చెందిన భారత సంతతి పురుష ఉద్యోగి సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయమై న్యూయార్క్ కౌంటీ సుప్రీం కోర్ట్‌లో అతడు కేసు వేశాడు. డైలీ మెయిల్ వార్తా సంస్థ కథనం ప్రకారం.. ఫిర్యాదిదారు జాన్‌పై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లోర్నా హజ్దిని (37) పలుమార్లు జాతి వివక్ష వ్యాఖ్యలకు, లైంగిక వేధింపులకు, దాడులకు పాల్పడ్డారు. 2024 వసంత కాలం నుంచి ఈ వేధింపులు ప్రారంభమయ్యాయి. వార్తా పత్రికల్లో రాయడానికి వీల్లేని అసభ్యకర భాషలో లోర్నా తన లైంగిక కోరికలు తీర్చమని తనను వేధించేదని ఫిర్యాదిదారు ఆరోపించారు. తన కోరికలు తీర్చకపోతే ప్రమోషన్ రాకుండా అడ్డుకుంటానని బెదిరించేదని వాపోయాడు.
ఇలా బెదిరించి రెండు, మూడుసార్లు అతడిపై ఆమె లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో ఉంది. ఫిర్యాదిదారును ఆమె 'లిటిల్ బ్రౌన్ బాయ్' గా హేళన చేసేది. అతడితో లైంగిక సంబంధం పెట్టుకోవడం కోసం మత్తు మం దు, అంగ స్తంభన పెంచే మందులను ఇచ్చేది. జాన్ ఆరోపణలను ధ్రువీకరించేందుకు ఇద్దరు సాక్షులున్నట్టు డైలీ మెయిల్ పేర్కొంది. లైంగిక వేధింపులపై నిరుడు మేలో జాన్ కంపెనీ యజమాన్యానికి ఫిర్యాదు చేశాక అతడికి బెదిరింపులు వచ్చాయి. జాన్ ఆరోపణలను జేపీ మోర్గాన్ చేస్ బ్యాంక్ ఖండించింది. ఈ విషయమై అంతర్గత విచారణ జరిపామని.. అతడి ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొన్నది.

# వాతావరణ కేంద్రం శుభవార్త

### తెలంగాణ, ఏపీలో మూడు రోజులపాటు వర్షాలు



: మండే ఎండలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం దక్షిణ కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపరితల ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది.

# భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ నష్టాల్లో ముగిశాయి. ఇరాన్ ఓడరేవులపై దీర్ఘకాలంపాటు దిగ్బంధనం కొసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర ఓ దశలో ఏకంగా 120 డాలర్లు దాటింది. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, రూపాయి విలువ పతనం మన సూచీలపై ప్రభావం చూపాయి.
సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర నష్టపోయింది. నిఫ్టీ మళ్లీ 24 వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లు పతనమై రూ.469 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,014.21 పాయింట్ల వద్ద నష్టాలతోనే ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,258.86 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 582.86 పాయింట్ల నష్టంతో 76,913.50 వద్ద స్థిరపడింది.ఇక నిఫ్టీ 180.10 పాయింట్ల నష్టంతో 23,997.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువల కూడా ఓ దశలో 95 మార్కు దాటి చివరికి 94.90 కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా స్టాక్స్ లాభపడ్డాయి.

## ఐకెపి సెంటర్లలో పేరుకుపోయిన వడ్లు..

# రైతుల కష్టాలపై బీజేపీ ఆగ్రహం!

- అధికారుల నిర్లక్ష్యం వీడాలి - మండల అధ్యక్షులు యెల్లంల శ్రీధర్ రెడ్డి డిమాండ్



**మోటకొండూరు, ఏప్రిల్ 30(వార్త వేధిక సూర్య ):** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, తెలంగాణ రైతాంగాన్ని ప్రభుత్వం తప్పుడు మాటలతో మోసం చేస్తోందని బీజేపీ మోటకొండూరు మండల అధ్యక్షులు యెల్లంల శ్రీధర్ రెడ్డి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. వడ్లు సగానికి పైగా కొన్నామని ప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతున్నా, వాస్తవానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం గుట్టలు అలాగే ఉన్నాయని మండిపడ్డారు. మోటకొండూరు మండలంలోని అన్ని ఐకెపి సెంటర్లలో కేవలం ఒకటి రెండు లారీలు మాత్రమే లోడింగ్ అయ్యాయని, రవాణా సౌకర్యం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్లలో పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, అధికారులను అప్రమత్తం చేసి, లారీల సంఖ్యను పెంచి తక్షణమే ధాన్యం తరలించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, పీసరి తిరుమలరెడ్డి, చిర్రా రవీందర్, అనంతర పాండురంగారెడ్డి, పాశం కృష్ణారెడ్డి, గాజుల బాలరాజ్, మల్గా అశోక్, సీస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభా చాటిన ప్రెసిడెంట్ స్కూల్స్ విద్యార్థులు




**భువనగిరి ఏప్రిల్ 29/ వార్త వేధిక సూర్య:-** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రెసిడెన్సి స్కూల్స్ విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు 100% పై ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రభంజనం సృష్టించిందని జిల్లాలో సెకండ్ ర్యాంకుతో శ్రావ్య 581/600 పొందారని ప్రెసిడెన్సీ గ్రూప్స్ ఆఫ్ చైర్ పర్సన్ తీగల జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అత్యుత్తమ ఫలితాలతో జిల్లాలో ముందంజలో నిలవడం సంస్థ ప్రతిష్టను మరింత పెంచిందని అన్నారు.



ఈ విద్యా సంవత్సరంలో మా విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించడం గర్వకారణం. ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులైన పి సాత్విక్ 571,ఆశ్రీత 564,సి ఎచ్ . సాత్విక 563, మార్కులుధనలక్ష్మి 557, మార్కులునాగ చరణ్ 552,టీ.శ్రీనిధి 552,550కి పైగా మార్కులు సాధించిన వారు 8 మంది500కి పైగా మార్కులు సాధించిన వారు 35 మంది విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఆధునిక బోధన పద్ధతులు, నిరంతర పరీక్షలు, వ్యక్తిగత శ్రద్ధ, మరియు క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం ఈ విజయానికి మూలస్థంభాలు. ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసం, మరియు విద్యార్థుల కృషి కలిసి ఈ అద్భుత ఫలితాలను సాధించాయని అన్నారు. అనంతరం జిల్లాలో ద్వితీయ ర్యాంకు సాధించిన శ్రావ్యను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ, వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయ బృందానికి పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జానపద గ్రామీణ వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఈర్లపల్లి ముత్యాలు



**ఆత్మకూరు (ఎం), ఏప్రిల్ 30, (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంజానపద గ్రామీణ వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు, గురువారం రోజున ఆత్మకూరు మండలంలోని కళాకారుల సమస్యల కోసం అధ్యయనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు మాట్లాడుతూ.. గ్రామీణ వృత్తి కళాకారులైన సింధు, యక్షగానం, బాగోతం,చెక్కభజన ,కాటిపాపలు, గంగిరెద్దులు , ఒగ్గుడోలు, బైండ్ల, కోలాటం, యాదాద్రి భువనగిరి జిల్లాలో వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారులు అనేకమంది ఉన్నారు పండుగ పబ్బాలలో అవమానాలు వివక్షతకు గురవుతున్నటువంటి జానపద గ్రామీణ వృత్తి కళాకారులు ఈ జిల్లాలో ఉన్నారు వారిని వివక్షతకు గురికాకుండా అవమానాలు ఎదురుగాకుండా ప్రభుత్వం ఆదుకోవాలనీ, అలాగే కళాకారుల వేషాధారణకు అయ్యేటటువంటి ఖర్చులు ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు ఇంకా కొన్ని గ్రామాలలో వివక్షత అంటరానితనం ఇంకా వెంటాడుతూనే ఉన్నది. బంతి భోజనాల కాడ కార్యక్రమాలు నిర్వహించే కాడ తుక్కాపురం గ్రామంలో సింధు కళాకారులు ఇంకా వివక్షతకు గురవుతూనే ఉన్నారు ఈ సమస్యలన్నిటిపై ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమగ్ర సర్వే నిర్వహించి వారి సమస్యలను గుర్తించి 2026 మే నెల రెండవ వారంలో జానపద గ్రామీణ వృత్తి కళాకారులను సమీకరించి జిల్లా కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలం ప్రజానాట్యమండలి అధ్యక్షుడు సంఘపాక స్వామి, సింధు కళాకారులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**మోత్కూరు, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య):** ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. గురువారం స్థానిక విశ్రాంతి భవనంలో మోత్కూరు పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన బి.ఆర్.ఎస్, సిపిఎం పార్టీల నుంచి 50 మంది శాసనసభ్యులు సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, దేశంలో ఎక్కడలేని విధంగా రేషన్ దుకాణాలలో సన్న బియ్యం, గృహిణిలకు గృహజ్యోతి 200 యూనిట్ల వరకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హాయంలో పేదలకు ఇల్లు నోచుకోలేని, ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి తొలి ఏడాదిలోనే నియోజకవర్గానికి 3500 ఇండ్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారని అన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని.. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం సోమ నర్సయ్య,వెంట నగేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన అక్షర ఉన్నత పాఠశాల విద్యార్థులు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న విద్యార్థులు

**మోత్కూరు, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అక్షర ఉన్నత పాఠశాల లో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్.ఆర్.ఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్ లో పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. విజేతలకు హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, అవార్డులు నిర్వాహకులు అందజేసినట్లు పాఠశాల డైరెక్టర్లు మలిపెద్ది రాజిరెడ్డి, మల్లిపెద్ది శివానీలు గురువారం విలేకరులకు తెలిపారు. ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులలో పాఠశాలకు చెందిన జి మోక్షిత 9వ తరగతి,పి లోకేష్ 8వ తరగతి ,పి హర్షిత ఏడవ తరగతి, పి పూజిత ఆరవ తరగతి ,ఎం. మాన్విక్ రెడ్డి 3వ తరగతి







విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలిచారు. అదే విధంగా జిల్లా టాపర్లుగా బీ లిఖిత 9వ తరగతి, పి వైష్ణవి 8వ తరగతి, ఏ అర్జున్ ఏడవ తరగతి,ఎన్. రోసి గ్రేసీ ఆరవ తరగతి, గాదెనబోయిన సాయి నక్షత్ర 5వ తరగతి, ఎం అక్షిత్ రెడ్డి 5వ తరగతి ,జీ సాన్విక 4వ, తరగతి, బి శ్రేయాన్స్ 3వ తరగతి, ఎన్ ఆదిత్య రెండవ తరగతి, ఎం విజ్ఞారెడ్డి ఒకటో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. డిస్టిక్ కన్సోలేషన్ టాపర్లుగా సిహెచ్ శ్రీహర్షిని, కే జస్వంత్ రెడ్డి, జే హర్షవర్ధన్, డి సాత్విని , ఈ. లాస్య, జె .సాయి నిఖిల్, ఏ విక్రం రెడ్డి, టీ అలేఖ్య, బి అభిరామ్, కే గోపీనాథన్ రెడ్డి అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి సీతక్క, ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ రమణారావు హాజరైనట్లు తెలిపారు .శ్రీ రామానుజ ఫౌండేషన్ ప్రెసిడెంట్ తుమ్మ అమరేష్, డాక్టర్ ఎలమంచిలి జగదీష్ బాబు, చిరంజీవి శ్రేయాన్స్ మురళీకృష్ణ, సామాజిక కార్యకర్త అన్నం శ్రీనివాస్, ఏసిపి పింగళి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని అభినందించిన సర్పంచ్ సాయికుమార్ గౌడ్

**రామన్నపేట , ఏప్రిల్ 30 (వార్తా వేదిక సూర్య)** పదో తరగతి ఫలితాల్లో రామన్నపేట మండలంలోని భోగార గ్రామానికి చెందిన రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ కుమారుడు సద్గురు యాదవ్ కు 532/మార్కులురి సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచిన బోగారం గ్రామ సర్పంచ్ శ్రీ కూనూరు సాయికుమార్ గౌడ్ గారు ఈరోజు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి నివాసానికి నేరుగా వెళ్లిన సర్పంచ్, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి, పట్టుదలతో చదివి ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విద్యార్థి తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని, భవిష్యత్తులో ఈ విద్యార్థి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామంలోని ఇతర విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ గారు స్వయంగా తమ ఇంటికి వచ్చి ప్రోత్సహించడం పట్ల విద్యార్థి మరియు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగారం ఉపసర్పంచ్ బై కానీ ఉమా మహేష్ యాదవ్ ఒకటో వార్డు మెంబర్ గోగు ప్రమీల రమేష్ యాదవ్ ఐదో వార్డ్ మెంబర్ నేరటి మానస సురేష్ యాదవ్ ఆరో వార్డు మాజీ వార్డు మెంబర్ కూనూరు రాజుగారు వనం సిద్దేశ్వరి గారు కునూరు మహేష్ గౌడ్ గోగు మధు యాదవ్ గోగు సత్యనారాయణ యాదవ్ బడుగు శివ నేత కొక్కుల శంకర్ మేడి కృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది.




# పాటిమట్ల విద్యార్థుల పదవ ఫలితాల ప్రభంజనం

**మోత్కూరు, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య):** ఈ నెల 29 న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోని పాటిమట్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు చరిత్రను సృష్టించారు. 100% ఫలితాలతో మండలంలో ముందు వరుసలో నిలిచింది. 19 మంది పరీక్ష రాయగా 600 మార్కులకు బిట్టు మణికంఠకు 528, చల్ల పల్లవి 509, ఆవుల రామ్ చరణ్ 506, ధరావత్ శ్రావణి 502, నక్క ప్రణవి 501, అత్యుత్తమ ఫలితాలు పొందగా 14 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో పాస్ ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల పట్ల ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్ గురువారం ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం,, గ్రామస్తులు అభినందించారు.



# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఐక్య పోరాటాలే శరణ్యం!
- మోటకొండూరులో లక్ష్మీనరసింహ పెయింటర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక.

**మోటకొండూరు, ఏప్రిల్ 30(వార్త వేధిక సూర్య):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నల్ల చట్టాలు కార్మిక వర్గ హక్కులను కాలరాస్తున్నాయని, వాటి రద్దు కోసం కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం మోటకొండూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన శ్రీ లక్ష్మీనరసింహ పెయింటర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

## మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం ఏఐటీయూసీ అధ్యక్షులు కొల్లూరు మల్లేష్ మాట్లాడుతూ.. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందన్నారు. రేపు (మే 1న) జరగబోయే మేడే ఉత్సవాలను మండలంలోని అన్ని ప్రజా సంఘాలు, పార్టీ శ్రేణులు కలిసి గ్రామగ్రామాన ఊరేగింపులతో బ్రహ్మాండంగా నిర్వహించాలని కోరారు.

## నూతన కమిటీ ఎన్నిక

అనంతరం పెయింటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా గిరబోయిన సుదర్శన్,ప్రధాన కార్యదర్శి బచ్చల కూర స్వామి,ఉపాధ్యక్షులు వడ్డేబోయిన కృష్ణ సహాయ కార్యదర్శి రేగు పండు,కోశాధికారి: కొల్లూరు సంజీవ,కమిటీ సభ్యులు పానుగంటి నరేందర్, జోసెఫ్. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, గిరబోయిన శ్రీశైలం, ఎండి. జాంగీర్, పల్లె గణేష్, పానుగంటి మల్లేష్, జంగాపల్లి నరేష్, కొల్లూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 334
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
శుక్రవారం,
మే 1, 2026

## చేనేత కార్మికుల ఖాతాలో డబ్బులు జమ



**భూదాన్ పోచంపల్లి,ఏప్రిల్ 30,(వార్త వేదిక సూర్య) :** నేతన్న భరోసా స్కీం లో భాగంగా పోచంపల్లిలో మొత్తం 3034 మంది చేనేత కార్మికులకు చేనేత కార్మికునికి రూ.4,500 సహాయకురాలికి 1,500 రూపాయలు చొప్పున అకౌంట్లో జమ కావడం జరిగిందని పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు గురువారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జోలి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బోనగిరి శాసనసభ్యులు కుశీ బం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా చేనేత జోలి శాఖ అధికారి ఏడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు , స్థానిక నాయకులు తడక రమేష్, భారత లవ కుమార్, పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## పది ఫలితాల్లో యాదగిరిగుట్ట శ్రీ గౌతమ్ హైస్కూల్ ప్రభంజనం






**యాదగిరిగుట్ట ఏప్రిల్ 30, (వార్త వేదిక సూర్య) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పట్టణం లోని శ్రీ గౌతమ్ హైస్కూల్ విద్యార్థి కె.అరుణ్ కుమార్ / తండ్రి దేవదాస్ 563/600 ఉత్తీర్ణత సాధించారు. శ్రీ గౌతమి హైస్కూల్ లో ఎస్ఎస్ సి పరీక్షలకు హాజరు అయిన 67/67 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినందుకు శ్రీ గౌతమ్ పాఠశాల కరస్పాండెంట్ మిర్యాల దుర్గాప్రసాద్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి, అభినందించారు. విద్యార్థులకు ఈ విజయం కొరకు కృషిచేసిన అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పది ఫలితాలలో మండలంలోని అత్యధిక మార్కులు శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థుల మార్కుల మోత

▸▸ **విద్యార్థులను అభినందించిన శ్రీ చైతన్య ఏటీఎం వెంకట్. ప్రిన్సిపల్ బాలరాజ్**





**మొయినాబాద్ మున్సిపాలిటీ ఏప్రిల్ 30( వార్తా వేదిక సూర్య ):** పది ఫలితాలలో శ్రీ చైతన్య పాఠశాల విజయంలో ప్రతిభంబించిందని ఆ పాఠశాల ఏజీఎం వెంకట్ ప్రిన్సిపల్ బాలరాజ్ లు పేర్కొన్నారు పదవ తరగతి ఫలితాలలో శ్రీ చైతన్య పాఠశాల వం-సగా నాలుగు సంవత్సరాల నుంచి మండలంలోని టాపర్గా నిలుస్తుందని వారు అన్నారు 2025 26 మండల టాపర్గా శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిలు మరియం బేగం. మోర దీపాక్ష లు 600 గాను 577మార్కులు సాధించిమండలంలోని అత్యధిక స్థానంలో నిలిచి పాఠశాలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారని అన్నారు అదేవిధంగా పాఠశాలలో 10 ఫలితాలలో సందీప్ రెడ్డి 569 సాయి ప్రణీ, 569 గోపీచంద్ 569 ధరణి ప్రియ 568 శ్రీవల్లి 564 ఇలా 500 పైగా మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులతో మొయినాబాద్ మండలంలోని శ్రీ చైతన్య పాఠశాల తనదైన రీతిలో విద్యార్థులు ప్రతిభ ఘనపరుస్తూ అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాల యజమాన్యానికి మంచి పేరు సాధించడం ఎంత గర్వకారణంగా ఉందని వారు పేర్కొన్నారు విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా నాణ్యమైన విద్యనందిస్తూ విజ్ఞానంతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల మొయినాబాద్ మండలంలో ఎంతో మంచి పేరు ప్రఖ్యాతలతో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు 10 ఫలితాలు శ్రీ చైతన్య పాఠశాలకు ఆదర్శమని అన్నారు.

## పుట్టెడు దుఃఖంలో పది పరీక్షలు వ్రాసి ప్రతిభ చాటిన విద్యార్థి

▸▸ **తండ్రి శవం ఇంట్లో ఉన్నా.. కన్నీటితో పరీక్షలు వ్రాసిన విద్యార్థి.**



**మోత్కూరు, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య) ;** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరెళ్ల ఎల్లయ్య పదవతరగతి పరీక్షల ముందు రోజే గుండెపోటుతో మృతి చెందారు. మార్చి 14న పదవతరగతి పరీక్షలు ప్రారంభం కాగా తొలి పరీక్ష రోజే ఓ పక్క తండ్రి శవం ఇంట్లో ఉన్నా...మరో ప్రక్కా కుమారుడు హర్షవర్ధన్ పదవ తరగతి మాత్రం పరీక్ష వ్రాశాడు. హర్షవర్ధన్ స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. పది పరీక్ష ఫలితాల్లో 553 /600 మార్కులు సాధించి హర్షవర్ధన్ పుట్టెడు దుఃఖం లోనూ కన్నీటి పర్యంతమై తన ప్రతిభను చాటుకున్నాడు.పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియలలో పాల్గొన్న హర్షవర్ధన్ కన్నీటి పర్యంతం అందరిని కంట తడి పెట్టించింది. ఈ ఫలితాలపై హర్షవర్ధన్ గురువారం "వార్త వేదిక సూర్య ప్రతినిధి"తో మాట్లాడుతూ తన తండ్రి ఎల్లయ్య ఆశయం మేరకు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం పొందడమే తన ముందున్న లక్ష్యమని హర్షవర్ధన్ తెలిపారు.

# స్వామివారికి వైభవంగా మహా పూర్ణాహుతి సహస్ర కలశాభిషేక ఘటాభిషేకం

▸▸ **జయంతి ఉత్సవాలు పరిసమాప్తి**

**యాదగిరిగుట్ట ఏప్రిల్ 30 ( వార్త వేదిక సూర్య :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం ఉదయం స్వామివారి అలంకార సేవ నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి ద్వారా తోరణ పూజ మూర్తి కుంభారాధన చతు స్థానార్చన లక్ష్మి నృసింహ మూలమంత్రం గరుడ సుదర్శన మూల మంత్రం హోమములు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మాషబలి మహా పూర్ణాహుతి ఏ కొత్తర సహస్ర కలశాభిషేకం సహస్ర ఘటాభిషేకం నిర్వహించి నృసింహ ఆవిర్భావం స్వామివారికి మహా నివేదన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఉదయం ప్రాత రారా ధన యాగశాలలో చతుస్థానార్చన లక్ష్మీ నృసింహ సుదర్శన గరుడ మూల మంత్ర





హోమములు మహా పూర్ణాహుతి, అష్టోత్తర శతఘటభిషేకం, నృసింహ ఆవిర్భావం మహా నివేదన తీర్థ ప్రసాద గోష్ఠి చేపట్టి జయంతి ఉత్సవాలకు ఆలయ అర్చకులు పరిసమాప్తపలికారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి,ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్ర చార్యులు, ఉప ప్రధానార్చకులు, శ్రీధరాచార్యులు మాధవాచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, అర్చకులు సంపత్ కుమార్ చార్యులు, కిరణ్ కుమార్ చార్యులు, వినయ్ కుమార్ చార్యులు, ఆదిత్యాచార్యులు, సిద్ధార్థ చార్యులు, శ్రీనాథ్ చార్యులు, భరత్ కుమార్ చార్యులు, సూపరిండెంట్ సురేందర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సాధారణ సమావేశం

**మోత్కూరు, ఏప్రిల్ 30 (వార్త వేదిక సూర్య);** మోత్కూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్నసోమ నర్సయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 84 అంశాలను ఏజెండాలను చర్చించి ఆమోదించారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యులు మందుల సామేల్ పట్టణంలో ప్రధాన కూడలిలో టాయిలెట్స్ తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఉదయ సముద్రం నుంచి వచ్చే నీటి సరఫరా పైప్ లైన్ పెంచినట్లు తెలిపారు. పెద్ద చెరువులో కలుస్తున్నటువంటి మురుగు నీటిని శుద్ధి చేయుటకు సివరెజ్ మరమ్మతుల ప్లాంట్ ను ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, కౌన్సిలర్లు కురిమిళ్ళ ప్రమీల, సుల్తాన్ స్వామి, కొండ శోభ, మొగుళ్ల అనురాధ, గనగాని శైలజ, పొన్నాల శ్రీవిద్య, బీసు శ్రీకాంత్ గౌడ్, నల్ల మధు యాదవ్, కారు పోతుల వెంకన్న గౌడ్, మెంట రమణ , మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ మేనేజర్ ప్రభాకర్, మున్సిపల్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుండాల నూతన ఎస్‌హెచ్‌వోగా శోభన్ బాబు బాధ్యతల స్వీకారం



**గుండాల, ఏప్రిల్ 30 , వార్తవేదిక సూర్య :** గుండాల మండల పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌వోగా ఎస్ఐ శోభన్ బాబు గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం శోభన్ బాబు మీడియా మిత్రడు దంతురి శ్రీనివాస్ గౌడ్ తో మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతలను కాపాడటం తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నేరాలను అరికట్టడంలో ఎటువంటి రాజీ ఉండదని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, ప్రజలు తమ సమస్యలను ఎటువంటి భయాందోళనలూ లేకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని ఆయన కోరారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, వారి సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## భక్తులకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు



**మహేశ్వరం,ఏప్రిల్ 30, (వార్త వేదిక సూర్య) :** మండలం గ్రామ పంచాయతీ కార్యాలయము మహేశ్వరం నందు తేదీ :02-04-2026 నుండి 07-05-2026 వరకు గ్రామములో జరిగే శ్రీ శ్రీ మహంఖాళీ మరియు బీరప్ప పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని మహేశ్వరం గ్రామములోని శ్రీ శ్రీ బీరప్ప దేవాలయము వద్ద బీరప్ప పండుగకు వచ్చే భక్తులకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండుటకు గాను గ్రామ సర్పంచ్ శ్రీ మునగపాటి నవీన్ గారు ముందస్తు చర్యగా బీరప్ప దేవాలయము వద్ద నూతన బోర్ మోటార్ ను ప్రారంబించడం జరిగింది. ఇట్టి విషయమై గ్రామ సర్పంచ్ శ్రీ మునగపాటి నవీన్ మాట్లాడుతూ గ్రామములో వేసవి కాలములో ఎక్కడ కూడా త్రాగునీటి ఇబ్బందులు ఎదురు కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకొని ప్రతి వార్డులో బోర్ మోటార్స్ డ్రిల్లింగ్ చేయడముతో పాటు నూతన మోటార్ పంప్ సెట్స్ బిగించడము జరుగుతుందని తెలుపుతూ , అధెవిధముగా గ్రామములోని ప్రజలందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజిలు, రోడ్ల నిర్మాణములు చేపట్టడము జరుగుతునదని అన్ని రకాలుగా ప్రజలందరికీ తగిన మౌలిక వసతులు కల్పిస్తానని తెలిపినారు. అధెవిధముగా గ్రామములో జరిగే బీరప్ప ఉత్సవాలను గ్రామ ప్రజలందరూ ఆహ్లాదకర వాతావరణములో సంతోషకరముగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమము లో మహేశ్వరం గ్రామ ఉప సర్పంచ్ శ్రీ జొరల రమేశ్ గారు, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, అబ్దుల్ జావిద్, ,నాయకులు ,ఆవులకడి శ్రీశైలం ,టింగిర్కరి మక్కజీ ,సున్నం కృష్ణ ,మిద్దింటి బల్రజ్ ,పోల్కం కిష్టయ్య ,పోల్కం బాలయ్య ,మిద్దింటి బీరప్ప , మరియు గ్రామస్థులు పాల్గొనడము జరిగింది.



## శ్రీ విద్యా వికాస్ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థుల ప్రభంజనం




**మహేశ్వరం ఏప్రిల్ 30 వార్త వేదిక సూర్య:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో శ్రీ విద్యా వికాస్ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మహేశ్వరం మండలంలోని అత్యధిక మార్కులు సాధించి విజయడంక మోగించారు ఎండి. బుసుర 570 మార్కులు, మంచె నికిత 545 మార్కులు యాదగిరి శ్వేత 530 మార్కులు మరో ముగ్గురు విద్యార్థులు 529, మార్కులు 513, 510, మార్కులు సాధించారు మిగతా విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో పాస్ కావడంతో పాటు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచె రాఘవేందర్ మాట్లాడుతూ మొదటి సంవత్సరంలోనే 100% ఫలితాలతో పాటు మండలంలోని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తల్లిదండ్రులకు మరియు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేశారు ఈనెల 24వ తేదీన పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు ఇందులో పిఎసిఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ తో పాటు నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్ మొదలగు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి వెంకటేశ్వర స్వామి వేషధారణలో తదితర పాత్రలో చాలా చక్కగా వేయించడం జరిగిందని ప్రశంసించారు నాగారం గ్రామంలో జరిగిన హిందూ సమ్మేళనం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో చాలా ఉల్లాసంగా పాల్గొన్నారు మా పాఠశాల విద్యార్థులు ప్రతీ కార్యక్రమంలో మొదట ముందు ఉండటం మరియు వారి యొక్క సర్వ తోముక అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.









Printed, Published and [redacted]ned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at [redacted]RYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Na[redacted], Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**